హైదరాబాద్ వార్త



# డ్రోన్ల సాయంతో ట్రాఫిక్ రద్దీపై అధ్యయనం

### కెబిఆర్ పార్కు చుట్టూ రెండో వన్‌వే ట్రయల్ రన్... క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీపీ సజ్జనార్

**జూబ్లీహిల్స్, జూన్ 20, ప్రభాతవార్త**
హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్ ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్‌సిటీ) ప్రాజెక్టు నిర్మాణ పనుల నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిధిలోని కేబీఆర్ పార్కు చుట్టూ ఆదివారం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రెండో వన్‌వే ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ ట్రయల్ రన్‌ను నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్, డీసీపీ కాజల్, జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ రమణారెడ్డి, ఏసిపి కట్టా హరి ప్రసాద్ తదితర అధికారులతో కలిసి కేబీఆర్ పార్కు మెయిన్ గేట్, బసవతారకం ఆసుపత్రి, అగ్రసేన్ జంక్షన్, ఫిలింనగర్, రోడ్ నంబర్45 మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో పెరగనున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ట్రయల్ రన్ చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమన్నారు. గతంలో ఏప్రిల్ 5న నిర్వహించిన తొలి ట్రయల్ రన్‌లో గుర్తించిన లోపాలను సరిదిద్దిన అనంతరం రెండోసారి ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు మాత్రమే ట్రయల్ రన్ కొనసాగుతుందని, సోమవారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు యథావిధిగా సాగుతాయని సీపీ స్పష్టం చేశారు. ట్రయల్ రన్ సందర్భంగా ఎదురయ్యే ఇబ్బందులను అధ్యయనం చేసి, అవసరమైన మార్పులు చేపడతామని తెలిపారు. కేబీఆర్ పార్కు పరిసరాల్లో భవిష్యత్తులో ఏడు ఫ్లైఓవర్లు, ఏడు అండర్‌పాస్‌లు అందుబాటులోకి రానున్నాయన్నారు. వన్‌వే విధానం వల్ల ప్రయాణ దూరం కొద్దిగా పెరిగినా, ట్రాఫిక్ జామ్‌లు లేకుండా వాహనాలు సాఫీగా ప్రయాణించే అవకాశం ఉంటుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులు జారీ చేసే సూచనలు, అడ్వైజరీలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. రోడ్లపై కొనసాగుతున్న సివిల్ పనులను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, మార్గంలోని ఆసుపత్రులతో సమన్వయం చేస్తూ అంబులెన్సుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని సీపీ తెలిపారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ మాట్లాడుతూ, ట్రయల్ రన్‌లో లేన్లు మారే ప్రాంతాల్లో కొన్ని ఇబ్బందులు గుర్తించామని చెప్పారు. శాశ్వత అమలు సమయంలో వాటిని పరిష్కరించేందుకు చెక్‌పోస్టు కేబీఆర్ పార్కు మధ్య 150 మీటర్ల ఇంటర్‌చేంజ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే పాదచారుల భద్రత కోసం చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు వద్ద పెడెస్ట్రియన్ సిగ్నల్ల ఏర్పాటుపై నిపుణులతో అధ్యయనం కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ పూర్తి సమాచారం సేకరించిన అనంతరమే శాశ్వత మార్పులు అమలు చేస్తామని వెల్లడించారు. నగరాభివృద్ధి, సాఫీ ట్రాఫిక్ కోసం ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




వన్ వే పరిశీలిస్తున్న సజ్జనార్, జోయల్ డేవిస్

# ప్రశాంతంగా నీట్ యుజి పరీక్ష నిర్వహణ..!

### ఉప్పల్‌లో ఆలస్యంగా వచ్చిన ముగ్గురు వెనక్కి

**ఉప్పల్, జూన్ 21 ప్రభాతవార్త :** నగరంలో నీట్ యూజీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కొన్ని కేంద్రాల వద్ద చిరునామాలు సరిగ్గా తెలియక పోవడంతో ఒక దగ్గర పరీక్ష ఉంటే మరో కేంద్రానికి వెళ్లి ఒక విద్యార్థి పరీక్ష రాయలేకపోయింది. ఉప్పల్‌లో ఒక నిమిషం ఆలస్యం కారణంగా ముగ్గురు విద్యార్థినీలను నిర్వహకులు వెనక్కి పంపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలో నీట్ పరీక్ష రెండోసారి పకడ్బందీగా నిర్వహించారు. ఆయా కేంద్రాల వద్దకు మధ్యాహ్నాం 1.30 గంటలలోపు చేరుకోవాలని నిబంధనలు విధించారు. అయితే ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయం నెం.2లో పరీక్ష రాసేందుకు వచ్చిన నిజాంపేటకు చెందిన ఒక విద్యార్థిని సమయానికి గేటు వరకు వచ్చింది. కారు దిగి లోపలికి వెళ్లేలోగా సమయం ముగిసిందని పరీక్ష కేంద్రం నిర్వహకులు లోపలికి అనుతించలేదు. అయితే ట్రాపిక్ రద్దీ కారణంగా నిజాంపేట నుంచి వచ్చేలోగా సమయం ముగిసిపోయిందని, పరీక్ష రాసేందుకు అనుతించాలని బతిమిలాడిన నిర్వాహకులు అంగీకరించలేదు. మరో ఇద్దరు విద్యార్థినీలు ఆలస్యంగా రావడంలో పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. అర గంటల సేపు పరీక్ష కేంద్రం నిర్వహకులు, పోలీసులను వేడుకున్నా చేసేది లేక వారిని వెనక్కి పంపించారు.




కేంద్రీయ విద్యాలయంవద్ద ఆలస్యంగావచ్చిన విద్యార్థినిని అనుతించకపోవడంతో రోదిస్తున్న దృశ్యం

**బాగ్‌లింగంపల్లి బదులు శేరిలింగంపల్లికి వెళ్లి..**

పరీక్ష కేంద్రం చిరునామా విషయంలో గందరగోళానికి గురై ఓ విద్యార్థిని నీట్ యూజీ పరీక్ష రాయలేకపోయింది. కొడంగల్‌కుచెందిన ఝాన్సీ ప్రియ నీట్ యూజీ (రీఎగ్జామ్) పరీక్ష రాసేందుకు హైదరాబాద్ వచ్చింది. పరీక్ష కేంద్రం బాగ్‌లింగంపల్లిలో కేటాయించారు. ఝాన్సీప్రియ తొలుత బాగ్‌లింగంపల్లి బదులు శేరిలింగంపల్లికి వెళ్లింది. పొరపాటును గ్రహించి బాగ్‌లింగంపల్లికి చేరుకునే లోపు నీట్ పరీక్ష గడువు ముగిసింది. పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో నిరాశతో ఆమె వెనుదిరిగింది. మరోవైపు కోఠిలోని నీట్ పరీక్ష కేంద్రానికి నలుగురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో సిబ్బంది అనుమతించలేదు.

### కుటుంబ కలహాలతో

## ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య

**ముషీరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** భార్యా భర్తల మధ్య కలహాలతో గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడలోని అడ్వకేట్ కాలనీలో నివాసం ఉండే గౌసియాబేగం(32), మణికంఠరాజ్ 2015లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి విక్రాంత్(9) అనే ఒక బాబు ఉన్నాడు. గౌసియా బేగం, మణికంఠరాజ్‌లు వేరువేరు ఫైనాన్స్ కంపెనీలలో ఉద్యోగం చేస్తున్నారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారు తరచుగా గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్యా భర్తలు గొడవ పడ్డారు. గొడవ జరిగిన తర్వాత భర్త బయటకు వెళ్లి, ఇంటికి వచ్చి చూసేసరికి గౌసియాబేగం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దోమలగడూడ పోలీసులకు సమాచారం అందించటంతో, సంఘటనా స్థలికి చేరకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. గౌసియాబేగం తల్లి అమీదా కూతురును వేధించటంతోపాటు ఆమె మృతికి కారణమైన మణికంఠరాజ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## వివాహిత అదృశ్యం

**అల్వాల్, జూన్ 21 ప్రభాతవార్త:** వివాహిత అదృశ్యమైన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ చిత్తార్య కాలనీలో నబీన్ పెరియర్ తన భార్య ప్రీతి సింగ్(25)తో నివాసం ఉంటున్నారు. ఈ నెల 14 తేదీ నుంచి తన భార్య కనిపించడం లేదని నబీన్ పేరియార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు రోజు భార్య భర్తలు మధ్య గోడవ జరిగిన నేపథ్యంలో ఆమె ఇంటి నుంచి వెళ్ళిపోయినట్లు తెలుస్తోంది. ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ తీసుకుని ఆమె అదృశ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి

**సంజీవరెడ్డినగర్, జూన్ 21, ప్రభాతవార్త:** సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 9న ఫతేనగర్ ఫ్లైఓవర్ రోడ్డు పక్కన సుమారు 70 ఏళ్ల వయస్సుగల ఓ వ్యక్తి కదలలేని స్థితిలో పడిఉండగా డయల్ 100కు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఆ వ్యక్తిని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆ వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు డ్యూటీ వైద్యులు తెలిపారు. అనంతరం ఆ వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు విచారణ చేపట్టినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదని వెల్లడించారు. మృతి చెందిన వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే సనత్‌నగర్ పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ అశోక్ కోరారు. సమాచారం అందించేందుకు సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నంబర్ 8712680289ను సంప్రదించవచ్చని తెలిపారు.

## లోక్ అదాలత్‌లో 7,161 ట్రాఫిక్ కేసుల పరిష్కారం

**జూబ్లీహిల్స్, జూన్ 20, ప్రభాతవార్త**

నగరంలో పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసుల పరిష్కారం కోసం జూన్ 8 నుంచి జూన్ 20 వరకు నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 7,161 కేసులు పరిష్కరించినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్లతో వాహనాలు నడిపించడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి వివిధ రకాల పెండింగ్ కేసులను రోజువారీగా స్వీకరించి పరిష్కరించారు. పరిష్కరించిన కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 3,804 కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని 1,245 కేసులు, మైనర్లతో వాహనాలు నడిపించిన 1,042 కేసులు, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించిన 381 కేసులు, అలాగే ఇతర 689 కేసులు ఉన్నాయి.

మొత్తం 7,161 కేసుల పరిష్కారం ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన పెండింగ్ కేసులను వేగంగా తగ్గించడంతోపాటు, ప్రజల్లో చట్టాల పట్ల అవగాహన పెంచడం లో లోక్ అదాలత్ విధానం సమర్థవంతంగా పనిచేసిందని ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. నగర ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం, మైనర్లకు వాహనాలు అప్పగించడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు దూరంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) డి. జోయల్ డెవిస్ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 395 మందిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూన్ 20, ప్రభాతవార్త**

నగర ట్రాఫిక్ పోలీసులు రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 395 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో 331 మంది ద్విచక్ర వాహనదారులు, 16 మంది ఆటోరిక్షా డ్రైవర్లు, 46 మంది కార్ల డ్రైవర్లు, ఇద్దరు ఇతర వాహనదారులు ఉన్నారు. రక్తంలో మద్యం శాతం ఆధారంగా నమోదైన కేసుల్లో 30 నుంచి 50 శాతం మధ్య 77 కేసులు, 51 నుంచి 100 మధ్య 167 కేసులు, 101 నుంచి 150 మధ్య 81 కేసులు, 151 నుంచి 200 మధ్య 37 కేసులు, 201 నుంచి 250 మధ్య 16 కేసులు, 251 నుంచి 300 మధ్య 8 కేసులు, 300కు పైగా ఉన్న 9 కేసులు నమోదయ్యాయి.

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. రోడ్డు భద్రత కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీలు ఇకపై కూడా నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. నగరంలోని వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ విభాగం కోరింది.



జూ పార్కులోని నల్ల త్రాచు,నాగు పాము

## జూపార్కులో 26 రకాల పాములు

**చార్మినార్, జూన్ 21 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో 26 రకాల వంద పాములు ఉన్నాయి. సాధారణంగా మనుషులు పాములు అంటేనే భయ పడతారు. జూ పార్కును సందర్శించటానికి వచ్చే పర్యాటకులు తప్పకుండ ఎంతో ఆసక్తితో ఎన్‌క్లోజర్‌లోని పాములను తిలకిస్తుంటారు. జూపార్కులోని ఎన్‌క్లోజర్‌లో కోబ్రా, కింగ్ కోబ్రా, రక్త పింజరి, కట్లపాము, జెర్రిపోతులు, కొండ చిలువలతో పాటు ఇతర రకాల పాములు ఉన్నాయి. 1987 నుంచి నెహ్రూ జూలాజికల్ పార్కులో పాముల ఎన్‌క్లోజర్ ఉంది, విషసర్పాలైన కోబ్రా 8,కింగ్ కోబ్రా 3,రక్త పింజరి 3,కట్ట పాములు 3 ఉన్నాయి.యానిమల్ కీపర్లు ఎంతో జాగ్రత్తగా పాములు ఉన్న ఎన్ క్లోజర్ వద్ద వ్యవహరిస్తారు.కొన్ని పాములు వారానికి ఒక సారి,మరి కొన్ని పాములు వారానికి రెండు సార్లు ఆహారాన్ని తీసుకుంటాయి. పాములకు ఆహారంగా కప్పలు, బల్లులు,ఎలుకలను పెడతారు. కోబ్రా, కింగ్ కోబ్రాలు ఇరవై నుంచి ఇరవై ఐదు సంవత్సరాలు వరకు జీవిస్తాయి.జూ పార్కు యానిమల్ కీపర్లు పాముల విషయంలో చాలాజాగ్రత్తగా ఉంటారు. జూపార్కులో పాములపై చైతన్య కార్యక్రమాలను కూడ నిర్వహిస్తుంటారు.

## ఘనంగా అంతర్జాతీయ జిరాఫీ దినోత్సవం



జూపార్కులోని బన్నీ జిరాఫీ

**చార్మినార్, జూన్ 21 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాత బస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో ఆదివారం అంతర్జాతీయ జిరాఫీ(బన్నీ) దినోత్సవం ఘనంగా జరిగింది. పలురకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలతో కలిసి తయారు చేసిన ఐదు కిలోల కేక్‌ను జూపార్కులోని జిరాఫీకి తినిపించారు. జంతు మార్పిడిలో భాగంగా 2017లో కలకత్తా, అలీపూర్ జూపార్కు నుంచి నెహ్రూ జూలాజికల్ పార్కుకు ఈ జిరాఫీ వచ్చింది. పది సంవత్సరాలు వయస్సుగల మగ జిరాఫీకి బన్నీ అని పిలుస్తారు.ఈ కార్యక్రమంలో జూపార్కు క్యూరేటర్ జె.వసంత, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ ఎంఎ హకీం,పిఆర్‌ఓ హెచ్.హనీఫుల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలకు మణిధర్‌రావు

**కుత్బుల్లాపూర్, జూన్ 21 ప్రభాతవార్త :**

హైదరాబాద్‌కుచెందిన యువకుడు వరల్డ్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌కు ఎంపికయ్యారు. 2026జూన్ 22నుండి జూన్ 29 వరకు ఈపోటీలు జరగనుండగా హైదరాబాద్‌కు చెందిన రాహుల్ స్విమ్ అకాడమి నుంచి ఎంపికైన ఏకైన వ్యక్తిగా మణిధర్‌రావు నమోదయ్యారు. ఆయనకు కోచ్‌గా వ్యవహారించిన రాహుల్‌తో కలిసి మణిధంరావు దక్షణ కొరియాలోని ఇంచియాన్‌కు వెళ్లనున్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు భారతదేశం నుడి ఎంపికైన ఏకైక క్రీడాకారుడుగా మనిధర్‌రావు గుర్తింపు పొందారు. పది సంవత్సరాలుగా రాహుల్ స్విమ్ అకాడమిలో శిక్షణపొందినట్లు వారు పేర్కొన్నారు. సిఐఎంఎఎస్ వరల్డ్‌పిన్‌స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం ద్వారా జూన్22 నుండి జూన్ 29వరకు జరిగే పోటీలలో పాల్గొంటున్నారు. ఆయనతోపాటు ఆదే అకాడమికి చెందిన రాహుల్ సర్వారియా భారత జట్టుకోచ్‌గా వ్యవహరించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



భూమిని విక్రయించేందుకు యత్నించి నలుగురు నిందితులు

## నకిలీ పత్రాలతో భూమి విక్రయానికి యత్నం

### నలుగురు అరెస్ట్

**నార్సింగి, జూన్ 21 ప్రభాతవార్త:** నకిలీ పత్రాలతో భూమిని విక్రయించేందుకు యత్నించిన నలుగురిని నార్సింగి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ హరి కృష్ణారెడ్డి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపేట మండలం నార్సింగి గ్రామం బృందావన్ కాలనీలో ఉన్న భూమిని కొందరు వ్యక్తులు నకిలీ పత్రాల ఆధారంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని కోకాపేట్ నివాసితుడు నార్సింగి పోలీసులకు ఈ నెల 20వ తేదీన ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు భారత న్యాయ సంహిత సెక్షన్ల 318(4),336,338(3), 61(2) ఆర్/డబ్ల్యు 3(5) కింద కేసు నమోదు చేశారు. పోలీసులు విచారణ జరిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన మాకినేని శివశంకరప్రసాద్(74), మజ్జి నరేష్(43), గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కమ్మెల శ్రీనివాసరావు(58), హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన నల్లం ఆదినారాయణ(60)లను అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరివద్దఉన్న నకిలీ ఆస్థిపత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నలుగురిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కోట్ల రూపాయల విలువైన భూములను కొనేముందు సంబంధిత రిజిస్ట్రేషన్ శాఖలో డాక్యుమెంట్లను పరీక్షించుకోవాలని సూచించారు. గుడ్డిగా ఎవరినీ నమ్మి మోసపోవద్దని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

## రాంగ్‌రూట్‌లో వచ్చి..ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి..!

**హైదరాబాద్ జూన్ 21 ప్రభాతవార్త :** అత్తాపూర్ సమీపంలో రోడ్ రేజ్ ఘటన జరిగింది. రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ కారు డ్రైవర్ ఆర్టీసి బస్సును అడ్డగించి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. అనంతరం ఆగ్రహంతో బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలో కొంత సేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడపడంవల్ల ప్రమాదాల ముప్పుపెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుని రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేయాలని వాహనదారులు కోరుతున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



మంటలను ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

## జైన్ ప్లాస్టో కార్ప్ షాప్‌లో అగ్నిప్రమాదం

### అదుపులోకి తీసుకొచ్చిన అగ్నిమాపక సిబ్బంది

**మలక్‌పేట, జూన్ 21 ప్రభాతవార్త :** మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లోని జైన్ ప్లాస్టో కార్ప్ షాప్‌లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబం ధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మలక్‌పేట మహ బూబ్ మాన్షన్ మార్కెట్లోని మూడు అంతస్థుల జైన్ ప్లాస్టో కార్ప్ షాప్‌లో శనివారం అర్ధరాత్రి పొగలు కనిపించడంతో మార్కెట్లోని హమాలీలు గమనించి హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం కృష్ణకు తెలియజేయ డంతో వెంటనే ఆయన స్పందించి చాదర్‌ఘాట్ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే మలక్‌పేట, గౌలిగూడ, ముషీరాబాద్, గాంధీ అవుట్ పోస్టు ఫైర్ స్టేషన్లకు చెందిన అగ్నిమాపక శకటాలు సిబ్బంది, అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడానికి చర్యలను చేపట్టారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారి, ఎస్సై భరత్ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలను చేపట్టి పరిస్థితిని సమక్షించారు. జైన్ ప్లాస్టో కార్ప్ షాప్‌లో పేపర్ ప్లేట్లు, డిస్పోజబుల్ గ్లాసులు, విస్తరాకులు ఉండడంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది, అధికారులు గంటలపాటు తీవ్రంగా శ్రమించారు. సంఘటన ప్రాంతాన్ని డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ శ్రీదాస్ సందర్శించి పరిశీలించారు. అదే విధంగా అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు యుగంధర్ ప్రసాద్, మహమ్మద్ రఫీ, మలక్‌పేట్ ఫైర్‌ఆఫీసర్లు షౌకత్, వెంకటస్వామి తదితరులు సిబ్బందితో కలిసి గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. నాలుగు అగ్నిమాపక శఖటాలతోపాటు అధునాతనమైన బ్రాంకో స్కైలిఫ్ట్‌తో మంటలను ఆర్పివేశారు. టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ సంఘటన ప్రాంతానికి విచ్చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, ఫైర్‌సేఫ్టీ అనుమతులు ఉండాలని సూచించారు. మార్కెట్టుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభ వించలేదని అధికారులు పేర్కొన్నారు. షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి ఉండ వచ్చునని అధికారులు భావిస్తున్నారు. జైన్ ప్లాస్టో కార్ప్ షాప్ నిర్వాహకుడు నిఖిల్ మాట్లాడుతూ ఎంత ఆస్తి నష్టం సంభవించింది అనేది ఇంకా తెలియలేదని పేర్కొన్నారు.

## కారు ఢీకొని మహిళ మృతి

### పరారైన యువకుడు

**హైదరాబాద్ జూన్ 21 ప్రభాతవార్త :** ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ సంఘటన చోటుచేసుకుంది. కారు ఢీకొన్న ఘటనలో ఒక మహిళ మృతి చెందింది. కారు నడుపుతున్న వ్యక్తి కారును సంఘటనా స్థలంలోనే వదిలేసి పారిపోయాడు. ఆదివారం ఈ యాక్సిడెంట్ చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ యువకుడు సెల్ఫ్ డ్రైవ్‌కు ఇన్నోవా కారును అద్దెకు తీసుకున్నాడు. ఆ కారు ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 35 ఏళ్ల ఫహీమున్నిసా అనే మహిళను ఢీకొట్టింది. కారు ఢీకొట్టిన వేగానికి తీవ్రగాయాల పాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మహిళ చనిపోయిందని తెలియగానే..ఆ యువకుడు కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫహీమున్నిసా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. యువకుడికి కారు అద్దెకు ఇచ్చిన వ్యక్తిని అరెస్ట్‌చేశారు. నిందితుడిని ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి కుమారుడిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.



# నీట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ




బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలలో నీట్ పరిక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రియాంక ఆలా

**బేగంపేట జూన్ 21,ప్రభాతవార్త :** జిల్లాలో నీట్ (యూజీ)2026 పరిక్షను అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించినట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా అన్నారు. ఆదివారం బేగంపేట లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరిక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, పరిక్షా నిర్వహణ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలోని భద్రతా ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూం, మిగిలిన పరిక్షా సామాగ్రి భద్రపరిచే విధానాన్ని ఆమె తనిఖీచేసారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన భద్రతా చర్యలను పరిశీలించిన కలెక్టర్ పరీక్ష ముగిసే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రంలో అభ్యర్థుల కోసం కల్పించిన మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, ప్రథమ చికిత్స సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. బయోమెట్రిక్ విధానం, తరగతి గదుల్లో వెంటిలేషన్, జామర్లు, సీసీ టీవీ నిఘా వ్యవస్థలను ఆమె తనిఖీ చేసారు. బేగంపేట కేంద్రంలో మొత్తం 960 మంది అభ్యర్థులకుగాను వింగ్ ఏలో 720 మందిలో 70 మంది, వింగ్ బీలో 240 మందిలో 36 మంది గైర్హాజరైనట్లు మొత్తం 720 మందికిగాను 644 మంది ప్రజెంట్ కాగా, 76 మంది ఆబ్సెంట్ అయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) జారీచేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 27,954 మంది అభ్యర్థులకు గాను 24,973 మంది పరిక్షకు హాజరయ్యారని, 2981 మంది గైర్హాజరు అయ్యారని, మొత్తం 89.34 శాతం హాజరు నమోదైందని, కలెక్టర్ వెల్లడించారు. ఈ తనిఖీలలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సంధ్య, సెంటర్ అబ్జర్వర్ డా.కిషన్ నోడల్ అధికారి పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**నిమిషం ఆలస్యంగా వచ్చిన ముగ్గురిని అనుమతించని అధికారులు...**

ఆదివారం బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న నీట్(యూజీ) 2026 పరీక్షకు ఒక నిమిషం ఆలస్యంగా చేరుకున్న ముగ్గురు విద్యార్థులను అభ్యర్థులను అధికారులు లోపలికి అనుమతించలేదు. రమ్యప్రియ, చారుష, పల్లవి అనే ముగ్గురు అభ్యర్థులు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న నీట్ (యూజీ) 2026 పరీక్షకు ఒక నిమిషం ఆలస్యంగా చేరుకున్నారు.దీంతో అధికారులు వారిని పరీక్షకు అనుమతించలేదు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

## అల్వాల్‌లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

**అల్వాల్, జూన్ 21 ప్రభాతవార్త:** అల్వాల్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. అభివృద్ధి పనులకు శంఖుస్థాపనకు తోడు నిర్మాణంలో ఉన్న వాటిని పరిశీలించారు. వెంకటాపురం డివిజన్‌లోని లక్ష్మీనారాయణ కాలనీ, సుభాష్‌నగర్‌లో యుజిడి పనులను శంఖుస్థాపన చేశారు. అల్వాల్ వీకర్ సెక్షన్‌లో సామాజిక భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేయడం జరిగింది. ప్రజా అవసరాలు మేరకు అభివృద్ధిని కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మచ్చబొల్లారం జనప్రియ వద్ద సాగుతున్న ఆర్‌యుబి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆర్‌యుబి నిర్మాణం త్వరలోనే పూర్తి అవుతుందని మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. రైల్వేఅధికారులుతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్న నేపథ్యంలో పనులు సంతృప్తికరంగా సాగుతున్నాయని చెప్పారు. ఆచార్య జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని అల్వాల్ ఈ సేవా కూడలిలోని ఆయన విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలులో మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత అనీల్ కిషోర్, నేతలు డోలి రమేష్, శ్రీధర్‌గౌడ్, పరమేష్ పాల్గొన్నారు.

## ఆర్‌యుబి పనులు పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



ఆర్‌యుబి వద్ద మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్

**అల్వాల్, జూన్ 21 ప్రభాతవార్త:** మచ్చబొల్లారం రైల్వే ఆర్‌యుబి పనులను ఆదివారం కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ జితేందర్ నాథ్ ఆర్‌యుబి వద్ద ఉన్న రైల్వే ఇంజనీర్లు, సిబ్బందితో పనులుపై ఆరా తీశారు. ఆర్‌యుబి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానునున్నదని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దూర దృష్టి కారణంగానే ఆర్‌యుబిలు నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్‌రెడ్డి, దిడ్ల స్వామి, శ్రీశైలంయాదవ్, సంపత్‌యాదవ్, లడ్డురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆంథోని దీవెనలు ప్రజలపై ఉండాలి : ఎమ్మెల్యే



సెయింట్ ఆంథోని ఫీస్ట్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూన్ 21 ప్రభాతవార్త:** సెయింట్ ఆంథోని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. ఆదివారం 7వ వార్డు తిరుమలగిరి 108 బజార్‌లోని సెయింట్ ఆంథోని చర్చిలో నిర్వహించిన ఫీస్ట్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు మురళీ ముదిరాజ్, నాగినేని సరితతో పాటు చర్చి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరం : కొంతం దీపిక



యోగా వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక

**కంటోన్మెంట్, జూన్ 21 ప్రభాతవార్త:** ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరమని మోండా డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వెస్ట్ మారేడ్‌పల్లిలో పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ వినోద్, పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ చైర్మన్ నోముల ప్రకాశ్, కార్యదర్శి గుత్తికొండ రామేష్, మహిళా అభ్యుదయ సంఘం అధ్యక్షురాలు గంజి రజిని, నోముల రజిని, సునీత తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి

**సైఫాబాద్, జూన్ 21 ప్రభాతవార్త:** వృద్దులకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, వారి అనుభవాలను అర్థం చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ విద్యావేత్త డి.వెంకటరామయ్య సూచించారు. పిల్లలు పెద్దగా అయిన తరువాత వృద్దులైన తల్లిదండ్రులపై నిర్లక్ష్యం చేయడం ఎంత మాత్రం సమంజం కాదని, ఇది ఘోరమైన తప్పిదమని ఆయన హెచ్చరించారు. శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వృద్దులకు గొడుగులు, ఎలక్ట్రిల్ రీచార్జ్ బ్యాటరీలను స్వాతిక్ కొండూరు కోరిక మేరకు ఉచితంగా పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వృద్దులు ఆనేక సమస్యలకు గురవుతారని, వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంటుందని వర్షం కురిసినప్పుడు గొడుగులను ఉపయోగించుకోవాలని, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు విష జంతువుల బారిన పడకుండా బ్యాటరీ లైట్లను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్ శర్మ, మనిగండ్ల శ్రీనివాస్‌గుప్తా, పల్లెపాటె సత్యనారాయణ పాల్గొన్నారు.



వృద్దులకు గొడుగులు, బ్యాటరీలైట్లు పంపిణీ చేస్తున్న వెంకటరామయ్య

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**బిఆర్ఎస్ పార్టీ గోషామహల్ ఇన్‌చార్జి నాగేందర్**



మాట్లాడుతున్న నాగేందర్

**సైఫాబాద్, జూన్ 21 ప్రభాతవార్త:** ఎన్నికల ముందు రైతులకు, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆనేక హామీలు ఇచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని, బిఆర్ఎస్ పార్టీ గోషామహల్ ఇన్‌చార్జి జి.నాగేందర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి చేసిన వాగ్దానాల్లో ఒక్కటీ అమలు చేయలేదని ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు రైతుబంధు పథకం కింద రూ.10 వేలు చెల్లిస్తూ దానిని రూ.12 వేలకు పెంచారని, రేవంత్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి వస్తే రైతు భరోసా పేరిట రూ.15 వేలు చెల్లిస్తామని చెప్పి చెల్లించకుండా మోసం చేశారని ఆరోపించారు. కెసిఆర్ రైతు ప్రమాద బీమా పథకం కింది రూ. 5 లక్షలు చెల్లించారని, 24 గంటలు రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేశారని, ఆనేక నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తిచేశారని, ధాన్యాన్ని కొనుగోలు చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 500 రూపాయలు బోనస్ చెల్లించడం లేదని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, హైడ్రా పేరుతో భవనాలను కూల్చివేస్తున్నారని, రైతుల వెన్నుముక విరుస్తున్నారని, బిజెపితో రేవంత్‌రెడ్డి లోపాయికారిక ఒప్పందం కుదుర్చుకున్నారని ఆయన దుయ్యబట్టారు.

**గుడి-బడి మధ్య పేకాట క్లబ్‌ను ఎత్తివేయాలి...**

గోషామహల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజాసింగ్, బిజెపి మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మరికొంత మంది మాజీ కార్పొరేటర్లు కలిసి గుడి-బడి మధ్య ఒక పేకాట క్లబ్‌లకు అనుమతి ఇచ్చి నెలకు లక్షలరూపాయలు దోచుకుంటున్నారని బిఆర్ఎస్ గోషామహల్ ఇన్‌చార్జీ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. పేకాట క్లబ్ వల్ల ఆనేక కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతిలేకుండా శంకర్‌యాదవ్ 7 అంతస్తుల భవనాన్ని నిర్మించారని ఆరోపించారు. తక్షణమే వారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సూర్యప్రభ వాహనంపై శ్రీవారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

## ఘనంగా శ్రీవారి దేవాలయం వార్షిక బ్రహోత్సవాలు

**సైఫాబాద్, జూన్ 21 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి బాలాజీ భవన్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 21 వార్షిక బ్రహోత్సవాలు ఆదివారం రెండోరోజున ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామివారికి పూజలు జరిగిన తరువాత శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని సూర్యప్రభ వాహనంపైన, సాయంత్రం చంద్రప్రభ వాహనంపైన పురవీధుల్లో ఊరేగించడం జరిగింది. ఈ ఊరేగింపులో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపుల మహిళలు శ్రీవారికి మంగళహారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి స్వామికి పూలు, పండ్లు సమర్పించుకున్నారు. ఊరేగింపులో కోలాటం, భక్తిగీతాలు, డప్పు వాయిద్యాలు, సన్నాయిమేళాలు, గోవింద నామాలతో మార్మోగింది. ఊరేంగిపు సందర్భంగా కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఈ నెల 22వ తేదీ ఉదయం గజ వాహనంపై శ్రీవారి ఊరేగింపు పురవీధుల్లో కొనసాగుందని, అనంతరం శాంతి కళ్యాణం, సాయంత్రం గరుడ వాహనంపై శ్రీవారి ఊరేగింపు కొనసాగుతుందని ఎఈవో యు.రమేష్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల్లో టిటిడి ఉద్యోగులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు, బాలాజీభవన్ భక్తుల సొసైటి ప్రతినిధులు శ్రీనివాస్, వేణుమనోహర్ తదిరులు పాల్గొన్నారు.

## అనాధ విద్యార్థులతో ఫాదర్స్ డే వేడుకలు

**ఎల్.బి.నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** భాగ్యనగర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైతన్యపురిలోని ఆదర్శ అనాథాశ్రమంలోని విద్యార్థుల మధ్య ఫాదర్స్‌డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులకు దుస్తులు పండ్లు పంపిణీ చేసినట్లు భాగ్యనగర్ మహిళా సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ ఉప్పల నిర్మల తెలిపారు. విద్యార్థుల మధ్య ఫాదర్స్ డే పురస్కరించుకుని కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రశాంతిగుప్తా, కోశాధికారి చింతల పావని, అడిషనల్ సెక్రెటరీ పిఆర్.శ్రీదేవి, పిఆర్‌ఓ శైలజ, ఆర్గనైజర్స్ జయలక్ష్మి, సరోజ, శారద, లక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## పిల్లల అత్యున్నత భవిష్యత్తు నాన్న చెక్కిన శిల్పం

**తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి**

రవీంద్రభారతి, జూన్ 21 ప్రభాతవార్త : పిల్లల అత్యునన్నత భవిష్యత్తును తీర్చిదిద్దిన తండ్రి కథాంశమే ప్రముఖ రచయిత జాలాది రత్నసుధీర్ రచించిన నాన్న చెక్కిన శిల్పం పుస్తకమని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎ.దినకర్‌బాబులు అన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం, సన్మార్గంలో పెట్టడం, అభ్యున్నతి అత్యుత్తమ శిఖరాలను అధిరోహించి మంచి పేరుప్రఖ్యాతులు సాధించడంలో ప్రప్రథమంగా తండ్రి, తల్లి పాత్ర, ప్రాముఖ్యతలుండగా తర్వాతి స్థానంలో గురువులు ఉంటారని అలాంటి నిస్వార్థ సేవలను ఏనాటికీ మరువరాదని, మర్చినవాడు మనిషేకాదని విశ్రాంత ఐఎఎస్ అధికారి దినకర్‌బాబు అన్నారు. తల్లిదండ్రులు మనకు చెప్పిన విషయాలను ఆకలింపు చేసుకుంటే చాలన్న సారాంశాన్ని రత్నసుధీర్ రచించిన నాన్న చెక్కిన శిల్పం పుస్తకం చదివితే అర్థమైపోతుందని, ప్రతి పాఠకుడ్ని చదివించేలా ఉందని రచయితను ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రతీవారం నిర్వహిస్తున్న సాహిత్యావారంలో అంతర్జాతీయ తండ్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎ.దినకర్‌బాబు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి ప్రముఖ రచయిత జాలాది రత్నసుధీర్ రచించిన నాన్న చెక్కిన శిల్పం పుస్తకాన్ని విశిష్ట అతిథులు సి.ఎస్.రాంబాబు, డా. ఎన్.రఘు, డా. టి.నీలిమ, గుడిపాటి, వి.వి.ఎస్.దిలీప్ రచయిత రత్న సుధీర్ తదితరులతో పుస్తకాన్ని ఆవిష్కరించి ఎంతగానో అభినందించారు.



నాన్న చెక్కిన శిల్పం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాలాచారి, దినకర్‌బాబు



మొక్కలను నాటి, నీరు పోస్తున్న డాక్టర్ రవి శేఖర్‌రెడ్డి

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత: రవిశేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 21 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్, వెంగళరావునగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన భారీ మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ప్రదేశాలలో, ఇంటి ముందు ఆవరణలో ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ ఎం.రంగారావు, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ టి.వి.రెడ్డి, ప్రధాన కార్యదర్శి సారంగారావు, కోశాధికారి హైకోర్ట్ న్యాయవాది ఎం.లక్ష్మి కాంతరావు సభ్యులు ఎం.ప్రదీప్‌కుమార్, నాగరాజు, భారతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో యోగా దినోత్సవ వేడుకలు

**రామంతాపూర్, జూన్ 21 ప్రభాతవార్త :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రామంతపూర్ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రామంతపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కమిటీ హాల్, రామ్‌శంకర్‌నగర్‌లో యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి రామంతాపూర్ మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, జీవనశైలిలో క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు వేదాంతరామం, తిండేరు హనుమంతరావు, జగన్ యాదవ్, తూట్ నరసింహ, సురేష్, ఇటికల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవపురంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ నూతన కార్యాలయం ప్రారంభం

**నిజాంపేట్, జూన్ 21, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మహాదేవపురం డివిజన్‌లో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నూతన కార్యాలయాన్ని ఆదివారం డైరెక్టర్ నవోదయ సిద్దార్థ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో నిస్సహాయులు, బాధితులకు అండగా నిలవడంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణలో ఇటువంటి సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు న్యాయం అందించడంలో ముందుండాలని సూచించారు. ప్రజా ప్రభుత్వ హయాంలో చట్టానికి, మానవ హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. మహాదేవపురం డివిజన్‌కు విచ్చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్, తదితరులు

# ఓవర్‌లోడ్‌తో తిరుగుతున్న వాహనాలపై ఆర్టీఏ ఉక్కుపాదం

**హైదరాబాద్, జూన్ 21 ప్రభాతవార్త**

నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై ఇష్టారాజ్యంగా తిరుగుతున్న ఓవర్‌లోడ్ వాహనాలపై రవాణా శాఖ ఉక్కుపాదం మోపారు. రాత్రి రాత్రే మెరుపు దాడులు నిర్వహించి సుమారు 100 వాహనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ స్వయంగా పర్యవేక్షించారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రధాన రహదారులు, చెక్‌పోస్టుల వద్ద రవాణా శాఖ సిబ్బంది మోహరించారు. అర్థరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలు, టిప్పర్ల పని పట్టారు. ప్రధానంగా రోడ్ల నాణ్యతను దెబ్బతీస్తూ, ప్రమాదాలకు కారణమవుతున్న మెటీరియల్స్ తరలించే వాహనాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. గ్రానైట్స్, ఆష్, ఇసుక, కంకర, సిమెంట్ తరలించే 100 వాహనాలు సీజ్‌చేశారు అధికారులు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రవాణా శాఖకు చెందిన ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ పాల్గొన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, ఆర్టీవోలు, జిల్లా రవాణా శాఖ అధికారులు, మోటారు వాహన తనిఖీ అధికారులు, అసిస్టెంట్ మోటారు వాహన తనిఖీ అధికారులు ఈ దాడుల్లో భాగస్వాములయ్యారు. పరిమితికి మించి లోడుతో ప్రయాణించడం వల్ల రహదారులు ధ్వంసం అవ్వడమే కాకుండా, తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు మండిపడుతున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా సరే వదిలేదిలేదని, రాబోయే రోజుల్లోనూ ఈ తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతాయని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేశారు.

**100 వాహనాలను సీజ్ చేసిన ఆర్టీఏ అధికారులు**



అర్థరాత్రి భారీ లోడ్‌లతో రోడ్డుపైకి వచ్చిన లారీలు



ప్రొ. జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

## ప్రొ. జయశంకర్‌కు నివాళి

**కంటోన్మెంట్, జూన్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్ అన్నారు. జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం బోయిన్‌పల్లి జయనగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారుక. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్ యాదవ్, ఓంప్రకాశ్‌యాదవ్, అశోక్‌యాదవ్, శ్రీనివాస్, అశోక్, మధు, సత్యం, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**బొల్లారంలో...**



బొల్లారంలో ప్రొ. జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న గజ్జెల నాగేశ్

**కంటోన్మెంట్, జూన్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాన్నే అంకితంచేశారని ఉద్యమ నేత, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. జయశంకర్‌కు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం 8వ వార్డు బొల్లారంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారులు మురళీయాదవ్, జంగిలి రాజు, రావుల సతీష్, పెంట శ్రీహరి, అందె శ్రీను, యేసు తదితరులు పాల్గొన్నారు.

**మూసాపేటలో...**



జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 21, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అసామాన్యమైనదని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించాయి. పార్టీ నాయకుడు నర్సింగరావు ఆధ్వర్యంలో మూసాపేట ఆంజనేయనగర్ చౌరస్తాలోని జయశంకర్ విగ్రహానికి బండి రమేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, సాయిబాబా చౌదరి, మదన్మోహన్, అస్లాం, సుజాత, వాణి, శ్రీనివాస బాబు, రవి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్బినగర్ చౌరస్తాలో...**

**ఎల్.బి.నగర్, జూన్ 21ప్రభాతవార్త:** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఎల్‌బీనగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్త పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సల్వాచారి, స్వామి, ఉద్యమకారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గాయని అరుణరామ్‌కు స్వరమణి బిరుదు ప్రదానం



గాయని అరుణరామ్ కు స్వరమణి బిరుదును ప్రధానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 21 (ప్రభాతవార్త):** గానగంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని ఆదివారం చికడపల్లి త్యాగరాయ గానసభ లోని కళాసుబ్బారావు కళావేదికలో సెవెన్‌హిల్స్ సాంస్కృతిక సంఘసేవా సంస్థ అధినేత ఏడుకొండలు, కార్యదర్శి వి.లక్ష్మి ఆధ్వర్యంలో ప్రముఖ గాయని అరుణరామ్‌కు స్వరమణి బిరుదును ముఖ్య అతిధిగా హాజరైన వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామ రాజు, సంఘసేవకులు వడ్లకొండ వెంకటరావు హాజరై బిరుదు ప్రదానం చేసారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయనీ గాయకులు సాయి పావని, షాలిని రమేష్, పద్మ ప్రియా, లక్ష్మి ప్రియశ్రీ, ఆనందలక్ష్మి, మాధవి, మహర్షి నిర్వహించిన సినీ సంగీత విభావరిలో బాలు ఆలపించిన మధురమైన గీతాలను వినిపించి నివాళులు అర్పించారు. ఎస్పీబీ పాటల ప్రవాహానికి సంగీత ప్రియులు మంత్రముగ్ధులయ్యారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**

**చిక్కడపల్లి, జూన్ 21 (ప్రభాతవార్త):** ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరేలా చూడాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపైనే ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లిలో టీపీసీసీ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు రాజేష్ కుమార్ అగర్వాల్ స్థానిక సైంట్ గాబ్రియేల్ స్కూల్ విద్యార్థులకు అవసరమైన పాఠశాల వస్తువులు, షూలను పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమని కోదండరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంజి యాదవ్, నవీన్ నాయక్, నవ్వ రాజు, రఘువీర్, గంగాధర్, లక్ష్మణ్ వర్మ, రాములు ముదిరాజ్, ఉదయ్ మున్నూరు, నర్సింగరావు, బి.నాగరాజ్, వి. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు షూపంపిణి చేస్తున్న కోదండరెడ్డి


యోగా చేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, తదితరులు

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 21, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గం కెపిహెచ్‌బి కాలనీ 6వ ఫేజ్‌లోని అబ్దుల్ కలాం పార్క్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేత రత్నకుమారి, గురుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ యోగా వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

**వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌లో...**

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 21, ప్రభాతవార్త :** వివేకానంద నగర్‌లోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌లో యోగ డే కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పిఎసి ఛైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్‌రావు, పిఎస్‌ఆర్‌కె భగవాన్ పాల్గొన్నారు.

**కాటేదాన్‌లో...**


యోగా చేస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 21 ప్రభాతవార్త:** కాటేదాన్ డివిజన్‌లో ఆదివారం డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండ యాదవ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. జై గురుదేవ్ యోగా గ్రూప్ గురువులు విజయ్‌కుమార్, విమల నేతృత్వంలో బాబుల్‌రెడ్డి నగర్‌లోని బొడ్రాయి చౌరస్తాలో అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ప్రతీ రోజు యోగా చేయటం ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమణ గుప్తా, రావుల భాస్కరరావు, రామారావు, శేఖర్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**జింఖానా గ్రౌండ్‌లో...**

**కంటోన్మెంట్, జూన్ 21 ప్రభాతవార్త:** యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సికింద్రాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిరాం అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ నందు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవన విధానంలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువత, క్రీడాకారులతో కలిసి యోగాసనాలు నిర్వహించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి నందకిషోర్ గోకుల్, వివిధ విభాగాల అధికారులు, యువత, క్రీడాకారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పద్మారావునగర్ పార్కులో...**

**సికింద్రాబాద్, జూన్ 21 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పద్మారావునగర్ పార్క్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. మానసిక వత్తిడితో ప్రతి వ్యక్తి నేడు ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి యోగా సాధన వల్లే సాధ్యమవుతుందని పవన్ కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పార్క్‌లో తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వివరించారు. యోగా హాల్‌ను పెంచాలని యోగా సాధకులు పవన్‌కుమార్‌ను కోరారు. అనంతరం యోగా గురువులు జంగా కృష్ణయాదవ్, బి.కృష్ణ యాదవ్, శ్రవణ్ కుమార్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏసూరి మహేష్, వెంకట రమణ, ముక్క శ్రీనివాస్, హరిచారిలు పాల్గొన్నారు.

**సురభిపార్కులో...**

**చిక్కడపల్లి, జూన్ 21(ప్రభాతవార్త) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గాంధీనగర్ డివిజన్ ఆంధ్ర కేఫ్ చౌరస్తా సమీపంలోని సురభి పార్కు (పీ టీ కాలనీ)లో బిజెపి నాయకులు, స్థానిక కాలనీవాసులతో కలిసి ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ముఖ్య అతిథిగా బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ హాజరై ప్రసంగించారు. యోగ అంటే కేవలం వ్యాయామం మాత్రమేకాదు, అది శరీరం, మనస్సు, ఆత్మల సంగమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రత్న సాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, వి.ఎస్.టి. రాజు, వెంకటరమణ, శేషీకాంత్, సాయిగౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### ఉజ్జయినీ మహాకాళీ అమ్మను దర్శించుకున్న సచిన్ సావంత్

**బేగంపేట జూన్ 21,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్ ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు సచిన్ సావంత్ తెలియజేసారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు వేద ఆశీర్వాదాలు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారు భక్తులను చల్లగా కాచి కాపాడాలని కోరుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాంగోపాల్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు త్రికాల మనోజ్‌కుమార్‌ముదిరాజ్ ఆయనకు కండువాకప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హేమంత్ సింగ్ ఠాకూర్, శ్రీకాంత్‌చారి, శ్రీశైలం, సదానంద్, సంజయ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేత్రపర్వం వైష్ణవి కూచిపూడి రంగప్రవేశ విన్యాసం

**రవీంద్రభారతి, జూన్ 21 ప్రభాతవార్త :** శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్‌స్వామి శుభాశీస్సులతో ప్రముఖ నాట్యగురువు రేవతి కొమందూరి శిష్యురాలు, సరిత, భానుచందర్‌ల తనయ ఆదిత్రి వైష్ణవి కూచిపూడి రంగప్రవేశ నాట్యవిన్యాసం సభికులకు నేత్రపర్వం కావించింది. వైష్ణవి తన కూచిపూడి రంగప్రవేశాన్ని ముందుగా అరభిరాగం గణపతితాళంతో ప్రారంభించి తదుపరి గురుస్తుతి, కృష్ణశబ్దం, బాలగోపాల తరంగం, అన్నమాచార్య కీర్తన కులుకక నడవరు, తాండవేశ్వర, చివరిగా తిల్లానా అంశాన్ని అత్యంత అద్భుతంగా శృతి లయబద్ధంగా హావభావాలను ప్రదర్శించి ఆహుతులను మంత్రముగ్ధులను చేసి ప్రశంసలందుకుంది. గురు కె.రేవతి నట్టువాంగం, డి.మృదురవల్లి గాత్రం, సాయి కొలంక వయోలిన్, ఎం.చంద్రకాంత్ మృదంగం, కె.కార్తీక్ వీణ, రాఘవసాయి వేణువులతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ సందర్భంగా ప్రముఖ అతిథుల చేతులమీదుగా కళాకారిణి వైష్ణవి, గురువు రేవతిలను ఘనంగా సత్కరించారు.

### ఉప్పల్ మినీ శిల్పారామంలో సంగీత దినోత్సవ వేడుకలు

**ఉప్పల్, జూన్ 21 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో అంతర్జాతీయ సంగీత దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత సిస్టర్స్ సంగీత కళ, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్త రామదాసు, త్యాగరాజు, అన్నయ్య సంకీర్తనలు ఆలపించారు. శ్రీ వేదాంతం, శ్రీ తేజోభిరాం గారి మృదంగ విన్యాసం అలరించింది. కళాకారులు అనురాధ, మాలిని, హారతి, ఇషితా, కార్తీక, లౌకిక, అన్విక, శ్రీనివాస్, శ్రీయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా రీ నీట్ పరీక్షలు

**సెంటర్ల వెతుకులాటలో విద్యార్థులు**
**పరీక్ష కఠినం, వాడిపోయిన ముఖాలు**
**నిరుత్సాహానికి గురైన తల్లిదండ్రులు**


చివరి నిమిషంలో సెంటర్ను వెతుకుంటూ వచ్చిన విద్యార్థులకు సూచనలు చేస్తున్న పోలీసులు

**చాంద్రాయణగుట్ట, జూన్ 21, ప్రభాతవార్త :** అందరి ఉత్కంఠతకు తెరదించుతూ వైద్య విద్యలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) ఆదివారం నిర్వహించిన రీ-నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్ఈఈటి-యుజి)-2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షను సజావుగా నిర్వహించారు. గతంలో దొర్లిన తప్పుల నేపథ్యంలో అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. గత మే3వ తేదీ ఆదివారం నిర్వహించిన నీట్ యుజి పరీక్ష ప్రశ్నపత్రం పలు రాష్ట్రాలలో లీకై దేశ వ్యాప్తంగా గందరగోళానికి దారితీసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజల నుండి వచ్చిన విమర్శలు, వత్తిళ్లతో కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ దిగివచ్చి నీట్‌ను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఒక దిశలో తీవ్ర మనోవేదనకు గురైయ్యారు. కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ క్రమంలో తిరిగి రీ నీట్ పేరుతో జూన్ 21న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్టీఏ ప్రకటించింది. పరీక్షా సమయాన్ని 15 నిమిషాలు పెంచారు. విద్యార్థులు చెల్లించిన పరీక్ష ఫీజును తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. అందుకు ఎన్టీఏ వెబ్‌సైట్లో తల్లిదండ్రులు తమ బ్యాంక్ అకౌంట్స్ పొందు పరిచేలా చర్యలు తీసుకున్నారు. అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సమయంలో బ్యాంకు అకౌంట్ వివరాలు సరిపోల్చుకున్న తరువాతే రీ నీట్ హాల్ టికెట్ డౌన్‌లోడ్‌కు అవకాశం ఇచ్చారు. దాదాపు 40 రోజుల గందరగోళ పరిస్థితిలో రీ నీట్-2026 నిర్వాహణపై అందరిల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది. కనీసం ఈసారైన సరిగ్గా నిర్వహిస్తారా..? పరీక్ష మోడరేటని...కఠినమని..? విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు, మెంటర్లు, తల్లిదండ్రులు రకరకాలుగా విశ్లేషించారు.

**ర్యాంకుపై ఫిజిక్స్ ప్రభావం...**

అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఫిజిక్స్ (భౌతికశాస్త్రం) పేపర్ కఠినంగా వచ్చింది. జీవశాస్త్రం (బయాలజీ), రసాయన శాస్త్రం(కెమిస్ట్రీ)లు మధ్యస్థంగా వచ్చాయి. ప్రశ్నలు కొన్ని సుధీర్ఘంగా ఇవ్వటంతో చదువుకోవటానికే సమయం సరిపోయింది. దయాగ్రామ్లు, గ్రాఫ్‌లు ఆలోచించాల్సి వచ్చింది. దీంతో విద్యార్థులు వాటితో కుస్తీపట్టారు. రఫ్ వర్క్ కోసం గతంలో ఉన్న రెండు పేజీలకు అదనంగా మరో రెండు పేజీలు జోడించినా సరిపోలేదు. అయితే వారిని మైనస్ మార్కు వెంటాడటంతో సమాధానం పెట్టటంలో సరైన నిర్ణయం తీసుకోలేక పోయారు. ఇక్కడే సమయం తీసుకున్నారు. బయాలజీ పర్వాలేదనిపించినా అంత తేలికగాలేదు. కెమిస్ట్రీ తానేమి తక్కువ కాదన్నట్లు ఇంచుమించు ఫిజిక్స్‌తో పోటీ పడింది. మొత్తం మీద మే 3న నిర్వహించిన నీట్ పరీక్షతో పోలిస్తే కఠినమనేచెప్పాలి. పరీక్ష సమయం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు కాగా విద్యార్థులను 5.30 గంటల తరువాత వదిలారు. ఒక్కొక్కరు వాడిపోయిన ముఖాలతో బయటకు వచ్చారు. వారిని చూసిన తల్లిదండ్రులు ఉసూరుమన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న వారు నిట్టూర్చారు. రెండేళ్లుగా కొందరు, ఒకటి... రెండు...మూడులాంగ్‌టర్ములు తీసుకున్న విద్యార్థుల కోసం ఎంతో శ్రమించారు. తిరిగి మరో లాంగ్‌టర్మ తప్పదని ఆవేదన చెందారు. రీ నీట్ వల్ల తమ పిల్లలు నష్టపోయే అవకాశం ఉందని విచారం వ్యక్తం చేశారు. అయితే కొంత మంది విద్యార్థులకు పరీక్షకు హాజరు కాక పోవటం ఆలోచింప చేసింది.

**చివరి నిమిషంలో విద్యార్థులు...**

రీ నీట్ (యుజి)-2026 పరీక్షకు హైదరాబాద్ నగరంలో 69 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో 27,594 మంది విద్యార్థులను వేశారు. ఒక్కో కేంద్రంలో సుమారు 400 మందికి పైగా విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను ఉదయం 11 గంటల నుండిలోనికి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత అనుమతించలేదు. ఇదిలావుంటే మధ్యాహ్నం 1.25 గంటల వరకు కొందరు విద్యార్థులు పరీక్ష కేంద్రం కోసం వెతుక్కోవటం కనిపించింది. పోలీసులు, ఉపాధ్యాయులు వారికి తగిన సలహాలిచ్చారు.

కొందరైతే తమ వాహనాలపై తీసు కొని సంబంధిత పరీక్షా కేంద్రం వద్ద దిగబెట్టారు. వారం రోజుల ముందు నుండి అడ్మిట్ కార్డ్ డౌన్ లోడ్ చేసుకునే అవకాశం ఇచ్చినా చివరిరోజు, చివరి నిమిషంవరకు పరీక్షా కేంద్రం చిరునామను చూసుకోక పోవటంపై తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేశారు.

## జీడిమెట్లలో ట్రాఫిక్ సమస్యకు చెక్

**పేట్‌బషీరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త :** 132 డివిజన్ జీడిమెట్ల గోదావరి హోమ్స్ వద్ద ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా రోడ్డుపైకి విస్తరించిన చెట్ల కొమ్మలు బస్సులు, లారీలు వెళ్లే సమయంలో తగులుతూ తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న సమస్యను స్థానికులు గౌరవ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సూచనల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ కాంతా రావు వెంటనే జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసి చెట్ల కొమ్మలను తొలగించే పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కుంట సిద్దిరాములు సహకారం అందించగా, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది కలిసి రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపించారు. చెట్ల కొమ్మలు తొలగించడంతో గోదావరి హోమ్స్ పరిసర ప్రాంతంలో రాకపోకలు సాఫీగా మారాయి. బస్సులు, లారీలు ఇబ్బందులు లేకుండా ప్రయాణించే పరిస్థితి ఏర్పడడంతో స్థానికులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

### మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్

**తెలంగాణ జెఎసి అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ జి.రూబీ స్టీవెన్‌సన్**

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని తెలంగాణ జేఏసీ అంబర్‌పేట్ కన్వీనర్ జి.రూబీస్టీవెన్‌సన్ కొనియాడారు. ఆదివారం జయశంకర్ వర్థంతి సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పలు పుస్తకాలు రచించారని, కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చూడకుండానే 2011, జూన్ 21న మరణించటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పు సుధాకర్, శశిధర్, శిల్పి, అశోక్, దయాకర్‌యాదవ్, వర్కాల శ్రీకాంత్, బి.జాన్, భానుదాస్, అమర్నాథ్, శివ, బి.రవీందర్, ఎం.డి.అలీం తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధికి పాటు పడాలి : గోపాల్‌రెడ్డి

**యూసుఫ్‌గూడ, 21 జూన్, ప్రభాతవార్త:** నాయకులు కార్యకర్తలు ఆదిపత్యం కోసం కాకుండా అభివృద్ధి కోసంపాటు పడాలని మోతీనగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కబీర్‌నగర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గం పరిధిలోని 15 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్‌నాయకుల హవానే నడుస్తుందని దీనిపై సిఎం, టీపీసీసీ అధ్యక్షులు ప్రత్యేక దృష్టిసారించి పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కష్టపడే నాయకులకు గుర్తింపు ఇస్తూ ఎప్పటికప్పుడు ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు తగిన విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నెం కోటిరెడ్డి, జబ్బార్, సలీమ్, ఆయుబ్, వంజరి వెంకటేష్, నీరజ్, జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### కళ్యాణ్‌నగర్‌లో ఉచిత కళ్ల జోళ్ల పంపిణీ

**యూసుఫ్‌గూడ, 21 జూన్, ప్రభాతవార్త :** ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ వెంచర్3లో కల్లెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఉచిత నేత్ర పరీక్షల శిబిరంలో పరీక్షలు చేయించుకున్న దాదాపు 235 మంది లబ్దిదారులకు ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివ యాదవ్, మోసిమ్ కురేసి, ఎర్ర కృష్ణ, దూదల రవిగౌడ్, రాజ్‌కుమార్ గౌడ్, వీర రాఘవచౌదరి, గంటా మల్లేష్, శివకుమార్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

### భక్తిభజనలు కీర్తనల ఆధ్యాత్మికశోభతో తెలంగాణ ప్రజాకళ

**రవీంద్రభారతి, జూన్ 21 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్త కళాకారుల భక్తిభజనలు, కీర్తనలు, భక్తిగీతాల ఆలాపనల ఆధ్యాత్మిక శోభతో తెలంగాణ ప్రజాకళ ఉత్సవాలు వెల్లివిరిసాయి. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న(ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 99 రోజులపాటు నిర్విరామంగా జరుపుతున్న సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా వారంరోజులగా తెలంగాణ ప్రజాకళ ప్రదర్శనల్లో భక్తిభజన కళాకారులు శ్రావ్యమైన భక్తిగీతాల ఆలాపనలతో వీక్షకులను భక్తిపారవశ్యంలో ముందచెత్తి ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేస్తున్నాయి. ఈమేరకు శ్రీ శివభజన మందిరం, నాలాబజార్, సికిందరాబాద్ కళాకారులు, ఇంద్రిస్ బృందం, సుదర్శనం శ్రీనివాస్ బృందం, భాస్కరశర్మ బృందం, క్యాదాసి సంధ్యారాణి బృందం, వీరేష్ బృందం తదితరుల భగవత్ కీర్తనలు, భక్తిభజనలతో తన్మయుల్ని చేశారు, కళాకారులు శ్రీనివాస్, దశరథ్, గోపాల్‌స్వామి, శ్రీనివాస్‌యాదవ్‌లు ఆలపించిన భక్తిగీతాలు సభికులను భక్తిమార్గంలో పయనింపజేశారు. తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు దినకర్, జె.శ్రీనివాస్, డా. విజయ్‌కుమార్ తదితరులతో కలిసి కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## మేడ్చల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**పేట్‌బషీరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త :** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మేడ్చల్‌లో శివోహం యోగా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిబిరానికి విశేష స్పందన లభించింది. టీఎస్‌ఆర్ క్లబ్ హౌస్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 200 మంది యోగా ఔత్సాహికులు పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ యోగాసనాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను నిర్వాహకులు వివరించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఉల్లాసం పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ సీనియర్ నాయకుడు భరత్ సింహారెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ఉల్లాసం కూడా పెరుగుతుందని అన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంచుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన శివోహం యోగా రీసెర్చ్ సెంటర్ నిర్వాహకులను ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మణ్, మురళి మోహన్, ప్రహ్లాద్, సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ మంకాల, సురేందర్ రావు, మురళి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**నిజాంపేట్, జూన్ 21, ప్రభాతవార్త :** నిజాంపేట్ ఆపరేషన్ విభాగం పరిధిలో నేడు చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నిజాంపేట్ ఏఈ అధికారులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ కేటీఆర్ ఫీడర్ పరిధిలోని కేటీఆర్ కాలనీ, బాలాజీ హిల్స్, వినాయక్ నగర్, తిరుమలనగర్ పార్క్ ప్రాంతం, మేధా స్కూల్ ప్రాంతం, గాయత్రి గార్డెన్ విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ కేఎన్‌ఆర్ ఫీడర్ పరిధిలోని కేఎన్‌ఆర్ కాలనీ, న్యూ శ్రీనివాస కాలనీ ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయబడుతుంది. చెట్లకొమ్మల తొలగింపు, నిర్వహణ పనులు జరుగనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు ముందస్తుగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు.

**బాచుపల్లి పరిధిలో...**

**నిజాంపేట్, జూన్ 21, ప్రభాతవార్త :** బాచుపల్లి విద్యుత్ విభాగం పరిధిలో నేడు చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్ ఏ. శశిధర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలోని శ్రీ హోమ్స్‌కాలనీ, కేఆర్‌సీఆర్ హరిత వనం కాలనీ, ఏఎస్‌ఆర్ బృందావన్ కాలనీ, హైరైజ్ విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ క్రాంతినగర్ ఫీడర్ పరిధిలోని క్రాంతినగర్, ఆర్టీసీకాలనీ, రిసీనియా ట్రెండిల్లా ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయబడుతుంది. చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనులు జరగనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు ముందస్తుగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు.

**మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో...**

**మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 21 ప్రభాతవార్త:** విద్యుత్ మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు నందిముస్లాయిగూడ, ఎస్‌పినగర్, మారుతినగర్, రాంబాగ్, తేజస్వీనగర్, భరత్‌నగర్ కాలనీ, పిఆర్‌కె కాలనీ, అత్తాపూర్ ప్రాంతాలలో, 2 నుంచి 5 గంటలు వరకు అత్తాపూర్, సిబిఐటి కాలనీ, సోమిరెడ్డినగర్, ఏషియన్ ధియేటర్, పటేల్ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ బస్తీలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

**నార్సింగ్ పరిధిలో...**

**నార్సింగి, జూన్ 21 ప్రభాతవార్త :** విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, ఫీడర్ల మేయింటెనెన్స్ పనుల కారణంగా ఈ క్రింది ప్రాంతాలలో నేడు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని నార్సింగి సెక్షన్ ఏఈ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. 11.కేవీ శ్రీనగర్ ఫీడర్ పరిధిలోని శ్రీనగర్, గాయత్రి ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు సరఫరా ఉండదు. అలాగే సిబిఐటి సబ్‌స్టేషన్ 11.కేవీ గండిపేట్ ఫీడర్ పరిధిలో గండిపేట గ్రామంలో ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11.కేవీ సీబిఐటి పీడర్ పరిధిలోని సిబిఐటి, ఎంజిఐటి కళాశాలలు, సిబిఐటి బాయస్ హాస్టల్, భాగ్యలక్ష్మి హెచ్‌టి సర్వీస్, గోల్కొండ రీసార్ట్ ప్రాంతాలలో మధ్యాహ్నం 2.గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు కరెంటు సరఫరా నిలివేయడం జరుగుతుందని, ఇందుకు విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఏఈ వి.మణికంఠ పేర్కొన్నారు.

### యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, జూన్ 21 ప్రభాతవార్త:** యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా వేడుకల్లో ఆయన పాల్గొని యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. శారీరక దృడత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్,సాయిబాబా యాదవ్,నాయకులు కరణ్ సింగ్, యాదగిరి, సురేష్, సత్య నారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ మేయర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

**సంజీవరెడ్డినగర్, జూన్ 21, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం మాజీమేయర్ బొంతు రామ్మోహన్‌ను పరామర్శించారు. రాం మోహన్ బావమరిది జంగాల అనిల్ యాదవ్ ఇటీవల మరణించగా, అమీర్‌పేటలోని నివాసంలో ఆదివాకం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి తలసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించిన తలసాని, అనంతరం బొంతు రామ్ మోహన్‌తో పాటు అనిల్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు అశోక్ యాదవ్, టిల్లు బాయ్, ప్రదీప్ గౌడ్, రాహుల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ నేత జితేందర్‌శుక్లా మృతి బాధాకరం...**

**సంజీవరెడ్డి నగర్, జూన్ 21, ప్రభాతవార్త:** పార్టీ కార్యక్రమాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనే బిఆర్ఎస్ పార్టీ నాయకుడు జితేందర్ శుక్లా మృతి బాధాకరమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. అమీర్‌పేటకు చెందిన జితేందర్ శుక్లా ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బల్కంపేటలోని వారి నివాసానికి వెళ్లి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ, కరుణాకర్ రెడ్డి, బాబా, వేణుగౌడ్, ప్రకాష్‌గౌడ్, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, సుమిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉప్పల్ స్కైవాక్ ఎస్కలేటర్లు, లిఫ్టులు నిలిపివేత

**ఉప్పల్, జూన్ 21 ప్రభాతవార్త :** ఉప్పల్ స్కైవాక్‌లో సోమవారం విద్యుత్ నిర్వహణ సందర్భంగా లిఫ్టులు, ఎస్కలేటర్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు హెచ్ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు తెలిపారు. వార్షిక నిర్వహణ కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ స్కైవాక్ లో విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పనుల నిమిత్తం సోమవారంఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 3:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ఈ సమయంలో ఉప్పల్ స్కైవాక్ లోని లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయవని అధికారులు తెలిపారు. నిర్వహణ పనులు ప్రజల భద్రత, సౌకర్యాల మెరుగుదల కోసం చేపడుతున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

# రాష్ట్రంలో రాబోయేది బిసిల పాలన

**తెలంగాణ బిసి జెఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్**

**సైఫాబాద్, జూన్ 21 ప్రభాతవార్త:** రాష్ట్రంలో దొరలు, పటేళ్ల పాలనను అంతమొందించి బిసిల పాలనకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలంగాణ బిసి జెఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. బిసిల త్యాగాల పునాదులపై ఏర్పడినా అగ్రకులాలు పాలనకొనసాగిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్థంతిని పురస్కరించుకుని ఆదివారం బిసి జెఏసి భవన్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. అంతకు ముందు ఆయన జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో బిసిలు త్యాగాలు చేస్తే భోగాలు మాత్రం అగ్రకులాలు అనుభవిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలుత మంత్రి పదవికి ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ రాజీనామా చేసి త్యాగం చేశారని, తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానాలు చేసింది కూడా బిసి బిడ్డలేనని, ఉద్యమాన్ని ముందుండి నడిపించింది కూడా బిసిలేనని ఆయన వివరించారు. బిసిలను చైతన్యం చేసేందుకు జులై 1వ తేదీ నుంచి 31 వరకు 'దొరలు, పటేళ్లు-తెలంగాణ హఠావో-బిసి సిఎం బనావో అనే నినాదంతో సామాజిక తెలంగాణ ఏజెండగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, భాస్కర్ మేరు, సంధ్యారాణి, నరేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు


BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD
S.A. NO. 506 OF 2025

Between:
**K. Madhu,** R/o, H.No.1-9-78, Sri Vijaya Nagar Colony, Suryapet District ...Applicant

And

1). **ICICI Bank Limited**
1-11-256, 2nd Floor, Wall Street Plaza, Begumpet, Hyderabad-500016
Rep by its Authorized Officer
2). **Mr. Mantena Sridhar Rao**
Vidhya Nagar, Near Bus Stop Musheerabad, Hyderabad-500044
3). **Ms. Mantena Sri Varshitha Rao**
Vidhya Nagar, Near Bus Stop, Musheerabad, Hyderabad-500044 ...Respondents

**NOTICE**

To,
1). **Mr. Mantena Sridhar Rao**
Vidhya Nagar, Near Bus Stop Musheerabad, Hyderabad-500044
2). **Ms. Mantena Sri Varshitha Rao**
Vidhya Nagar, Near Bus Stop Musheerabad, Hyderabad-500044

Take notice that the Applicant herein has filed the above SA challenging the measures initiated by the Respondent No.1 under the SARFAESI Act., and Rules 2002. After hearing the submission made by the counsel for the Applicant, the Hon'ble Tribunal was pleased to directed the Applicant to take notice on Respondent No.2 & 3 through the paper publication and post the matter on **16.07.2026** for his appearance at 11.00 A.M., before the Debts Recovery Tribunal-II at 1st Floor, Triveni Complex, Abids, Hyderabad, either in person or through his advocate or authorized agent to show cause as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the application will be heard and determined in your absence.

**B. Sreenivasa Reddy**
Advocate
Counsel for the Applicant



IN THE COURT OF HON'BLE ADDL. DISTRICT AND SESSIONS JUDGE CUM ADDL. FAMILY COURT, SPL. SESSIONS JUDGE FOR FAST TRACKING THE CASES RELATING ATROCITIES AGAINST WOMEN AT KUSHAIGUDA
[illegible]
NOTICE
[illegible]



IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-Cum-IV ADDITIONAL METROPOLITAN MAGISTRATE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT MEDIPALLY
[illegible]
SCHEDULE OF PROPERTY
[illegible]

# యోగ..అమోఘ



కన్హా శాంతి వనంలో యోగాసనాలు వేస్తున్న అగ్నివీర్ సభ్యులు

## ఏకకాలంలో తెలుగు సహా 25 భాషల్లో కామన్ యోగా ప్రోటోకాల్

## కన్హా మెడిటేషన్ హాల్‌లో యోగాసనాలు వేసిన 300 మంది అగ్నివీరులు

## ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'హార్ట్‌ఫుల్‌నెస్'కు చోటు

**నందిగామ, జూన్ 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కీర్తి కిరీటంలో మరో అంతర్జాతీయ మైలురాయి చేరింది. హైదరాబాద్ శివార్లలోని హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ హెడ్‌క్వార్టర్స్ కన్హా శాంతి వనం వేదికగా సరికొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. ఒకే సమయంలో అత్యధిక భాషల్లో యోగా సెషన్‌ను విజయవంతంగా లైవ్ స్ట్రీమింగ్ చేసినందుకు గానూ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఈ ఘనత చోటు దక్కించుకుంది.

**భాషల సరిహద్దులు దాటిన యోగా**

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సిఫార్సు చేసిన 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్‌ను ఆధారం చేసుకుని ఈ రికార్డును నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ కాలమానాలను సమన్వయం చేస్తూ.. తెలుగు సహా 13 భారతీయ భాషలు, అలాగే 12 అంతర్జాతీయ భాషల్లో (మొత్తం 25 భాషల్లో) ఏకకాలంలో 13 స్ట్రీమింగ్‌ల ద్వారా ఈ యోగా శిక్షణను ప్రత్యక్ష ప్రసారం చేశారు. భాషా, సాంస్కృతిక భేదాలను అధిగమించి ప్రపంచాన్ని ఏకం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది.

**అగ్నివీరుల భాగస్వామ్యం అధికారిక గుర్తింపు**

కన్హా శాంతి వనంలో జరిగిన ఈ చారిత్రాత్మక వేడుకలో సుమారు 300 మంది అగ్నివీరులతో పాటు దేశ విదేశాల నుంచి వచ్చిన వేలాది మంది ప్రతినిధులు భౌతికంగా, లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొన్నారు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారిక ప్రతినిధి డాక్టర్ వసుధా రాణి ఈ రికార్డును క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారికంగా ధృవీకరించారు. అనంతరం హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులకు రికార్డు పత్రాలను అందజేశారు.



హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి దాజీ బృందానికి గుర్తింపు ధృవపత్రాన్ని అందజేస్తున్న ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయనిర్ణేత డాక్టర్ వసుధా రాణి



**ఆసనాల నుంచి అంతర్గత ప్రశాంతత వైపు..**

ప్రపంచ రికార్డు ప్రకటన అనంతరం హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమలేష్ డి పటేల్ (దాజీ) ప్రత్యేక హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన సెషన్‌తో ఈ వేడుకలను ముగించారు. ఈ సందర్భంగా దాజీ మాట్లాడుతూ.. యోగా అంటే కేవలం శరీరాన్ని వంచే ఆసనాలు మాత్రమే కాదు. అది అంతర్గత చైతన్యాన్ని, మనసులను అనుసంధానించే ఒక అద్భుత ప్రక్రియ. 25 భాషల్లో ఒకేసారి యోగా ప్రసారం కావడం అనేది విశ్వవ్యాప్త ఐక్యతకు నిదర్శనం అని పేర్కొన్నారు.







**యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి: తీగల కృష్ణారెడ్డి**

సరూర్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త: యోగా సాధన నిత్య జీవితంలో ఒక భాగం కావాలని హైదరాబాద్ మాజీ మేయర్, మాజీ హుడా ఛైర్మన్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. భారతీయ యోగా సంస్థాన్ జోనల్ చీఫ్ ద్యాసాని సుధాకర్‌రెడ్డి, టికెఆర్ వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేట్ టికెఆర్ కాలేజీ క్యాంపస్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి వాకర్స్, యోగా సంస్థాన్ సభ్యులతో కలిసి యోగా సాధన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగాను ప్రతి రోజు సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, వాణి, మాధవరెడ్డిలతో పాటు దాదాపు 300 మంది పాల్గొన్నారు.



యోగా చేస్తున్న కృష్ణారెడ్డి



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

# ప్రభుత్వ ఆసుపత్రి పేదోడి దేవాలయం

### రోగులకు మెరుగైన వైద్య అందించాలి- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**తాండూరు, జూన్ 21, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రి పేదోడికి దేవాలయం వంటిదని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తాండూరు పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రితో పాటు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పలు విభాగాలను సదర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఆప్యాయంగా పలకరించారు. ఆసుపత్రి ఎలా ఉంది.. వైద్య సేవలు సక్రమంగా అందిస్తున్నారా.. భోజనం పెడుతున్నారా.. అంటూ అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని అన్నారు. అంతకు ముందు ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను, పలు రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నిరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, ఆసుపత్రి సూపరిండెంట్ వినయ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది, పార్టీ నాయకులు ఉన్నారు.



జెన్నీని సత్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ

## సినీ నటుడు జెన్నీకి ఘన సత్కారం

**చిక్కడపల్లి , జూన్ 21 ప్రభాతవార్త :** కళాకారులే కాకుండా సాధారణ ప్రజలు కూడా కళలను ఆస్వాదించడం మానవ సహజ స్వభావమని తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. మిమిక్రీ, మ్యాజిక్, మైమ్ కళలు ప్రధానంగా వినోదాన్ని అందించినప్పటికీ, ఆయా కళాకారులు సామాజిక బాధ్యతతో కూడిన సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై గానసభ, ఆనందలహరి, హైదరాబాద్ మ్యాజిషియన్స్, భవిరి ఆర్ట్స్, మావా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్రీఎం సప్తాహంలో భాగంగా ప్రముఖ సినీ నటుడు, మైమ్ కళాకారుడు జెన్నీ 81వ జన్మదినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన నాయుడు సత్యనారాయణ, నటులు అశోక్ కుమార్, మానిక్, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, వంశీ రామరాజు, ప్రముఖ వ్యాఖ్యాత భార్గవి, డబ్బింగ్ కళాకారుడు ఆర్‌సీఎం రాజు తదితరులతో కలిసి సినీ నటుడు జెన్నీని సత్కరించారు. ఈ సందర్భంగా నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ సినీ నటుడిగా జెన్నీ తన హాస్య నటనతో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారని అభినందించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, బాలల సాహిత్య రచయిత చొక్కాపు వెంకట రమణ, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, నటులు అశోక్ కుమార్, మానిక్, మల్లాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎంవిబిఆర్‌వై పథకంలో కార్మిక హిత సంస్కరణలు

**చిక్కడపల్లి, జూన్ 21 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, కాంట్రాక్ట్, పేద మరియు కార్మిక వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన సంస్కరణలు, భద్రతా చర్యలు చేపట్టాలని అఖిల భారతీయ ఠేకా మజ్దూర్ మహాసంఘ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం జరిగిన సమావేశంలో బిఎంఎస్ అనుబంధ మహా సంఘ్ ప్రధాన కార్యదర్శి సచిన్ మెంగాలే, తెలంగాణ ప్రాంతీయ ఈపీఎఫ్ కమిటీ సభ్యుడు కె.వి. రాధాకృష్ణన్ సంయుక్తంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా, కార్మిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, కేంద్ర భవిష్యనిధి కమిషనర్ (సీపీఎఫ్‌సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీఈపీఎఫ్) చైర్మన్‌లకు విజ్ఞప్తి చేశారు.

# లక్షలు విలువైన ఇసుక.. రహస్య వేలం!

★ కార్యాలయ సిబ్బందికి సమాచారం లేకుండా వేలం ★ రూ.4లక్షల విలువ చేసే లోడు రూ.36 వేలకే ధారాదత్తం ★ ప్రభుత్వ ఖజానాకు గండి ★ పట్టా పాస్‌బుక్‌ల పేరుతోనూ నిలువు దోపిడీ ★ ముడుపులు అందితే ఆగమేఘాల మీద క్లియరెన్స్ ★ లేదంటే కొర్రీలతో పేద రైతులకు ముప్పతిప్పలు ★ సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల డిమాండ్

### తహసీల్దార్ ఆఫీసులో ఓ క్షేత్రస్థాయి అధికారి లీలలు



యాలాల పిఎస్‌లో ఇసుక తరలిస్తున్న యంత్రాలు

**యాలాల, జూన్ 21, ప్రభాతవార్త :** ప్రజలకు సేవ చేయాల్సిన ఆ ప్రభుత్వ కార్యాలయం ఓ కీలక అధికారి పుణ్యమా అని అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ దందా జరిగేది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో.. అదీ ఆయన అనుయాయుల కనుసన్నల్లో ఉండే యాలాల మండల కేంద్రం లోనే. ఇంత ప్రాధాన్యత ఉన్నా... ఇక్కడి తహసీల్దార్ ఆఫీసులోని ముఖ్య విభాగానికి సంబంధించి పనుల కోసం దరఖాస్తు చేసుకోవంటే సామాన్యులకు ముప్పతిప్పలు తప్పడం లేదు.

క్షేత్రస్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఓ అధికారి పనితీరు వల్ల నానా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. సదరు అధికారికి ముడుపులు అందితే ఎంతటి పనైనా ఆగమేఘాల మీద చేసి పెడతారని, లేదంటే సవాలక్ష కొర్రీలు పెట్టి ముప్పతిప్పలు పెడుతున్నారని పలు గ్రామాల ప్రజ లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. భూముల పంచనామా పూర్తిచేసి ఫైళ్లు తహసీల్దార్ ముందుకు వెళ్లాలన్నా, కార్యాలయ సిబ్బందికి కూడా సమాచారం లేకుండా పనులు చక్కబెట్టాలన్నా ఈ కీలక అధికారి చేతులు తడపాల్సిందనేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇటీవల యాలాల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న రూ. 4 లక్షల పైగా విలువ చేసే సుమారు 120 ట్రాక్టర్ల ఇసుకను బహిరంగ వేలం వేయకుండా రహస్యంగా అప్పజెప్పడం పలు అనుమానాలకు తెరలేపింది. గత రెండేళ్లుగా అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఈ ఇసుకను నిబంధనల ప్రకారం బహిరంగ ప్రకటన సర్క్యూలర్ జారీ చేసి, ఎక్కువ కోట్ చేసిన వారికి అప్పగించాల్సి ఉండగా.. సదరు అధికారి అందుకు విరుద్ధంగా వ్యవహరించారని తెలుస్తోంది.

120 ట్రాక్టర్ల ఇసుకను కేవలం 60 ట్రాక్టర్లుగా నిర్ధారించి, ఎలాంటి బహిరంగ ప్రకటన లేకుండా రూ. 4 లక్షల విలువైన ఇసుకను కేవలం రూ. 36 వేలకే యాలాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి కట్టబెట్టారని స్థానికులు మీడియాకు వివరించారు. ఈ వ్యవహారానికి సంబంధించి కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్, సెక్షన్ అధికారికి కూడా ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది.

కొడంగల్ శ్రీ వెంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణం కోసం ఇసుకను కేటాయించే దైవకార్యం సాకుతో సదరు అధికారి భారీగా ముడుపులు తీసుకోవడమే కాకుండా, ఒక టిప్పర్ ఇసుకను పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది.

**అన్నీ ఆయనే చూస్తున్నారు : తహసీల్దార్**

ఈ విషయమై యాలాల తహశీల్దార్ గాయత్రిని వివరణ కోరగా, ఇసుక వేలం బాధ్యతను సదరు కీలక అధికారికి అప్పగించామని, ఈ వ్యవహారం అంతా ఆయనే చూసు కుంటున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకుల జోక్యం ఉందని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

**కొంతమంది ఒత్తిడి వలనే తూతూ మంత్రంగా వేలం వేశాం**

మరోవైపు సదరు అధికారి వివరణ ఇస్తూ.. ఇసుక వేలం విషయంలో స్థానిక నేతలతో పాటు మరికొంత మంది ప్రముఖుల జోక్యం, తీవ్ర ఒత్తిడి ఉండడం వల్లే తూతూ మంత్రంగా వేలం వేసి కొడంగల్ ఆలయ పునర్నిర్మాణం కోసం తరలించామని వివరించారు. మీడియా ఈ వ్యవహారాన్ని తేలిగ్గా తీసుకోవాలని కూడా సలహా ఇచ్చారు.

**పాస్‌బుక్‌ల కోసం ఎకరాకు 2వేలు వసూలు చేసి కూడా..**

సదరు అధికారి అక్రమాల చిట్టా ఇంతటితో ఆగలేదు. గత రెండేళ్ల క్రితం గంగాసాగర్, రాస్నం గ్రామాలకు చెందిన రైతుల భూములను ఆన్లైన్ చేసి కొత్త పట్టా పాస్ బుక్‌లు ఇప్పిస్తానని ఎకరాకు రూ. 2 వేల చొప్పున రైతుల వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసి, ఇప్పటికీ ఫైలు ముందుకు కదపకుండా కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు అనుకూలమైన తహసీల్దార్ వచ్చేవరకు ఓపిక పట్టాలని కాలయాపన చేస్తున్నట్లు సమాచారం.

**రైతుల నిస్సాహాయతను ఆసరా చేసుకుని..**

వివాదాస్పద సర్వే నంబర్ 38లో ఉన్న ఈ భూముల సమస్యను పరిష్కరించాలని రైతులు గతంలో మాజీ మంత్రి డాక్టర్ పి.మహేందర్‌రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని, తాజా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలతో పాటు అప్పటి కలెక్టర్లను కలిసి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. చేసుకుని సదరు అధికారి ప్రధాన సూత్రధారిగా ఉంటూ సిబ్బంది ద్వారా భారీగా డబ్బులు వసూలు చేయించారని రైతులు ఆరోపిస్తున్నారు.

**పోలీసుల సాయంతో బెదిరింపులు**

అలాగే మండలంలో ఎక్కడ మట్టి, మొరం తరలించినా ఈ అధికారి బ్రోకర్ల సహాయంతో అక్కడ వాలిపోయి, పోలీసులను వాడుకుంటూ రైతులను భయపెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తాం : ప్రజా సంఘాల హెచ్చరిక**

ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేకూరుస్తూ, పలు భూవివాదాలు, ఇసుక, మట్టి తరలింపుల్లో అవినీతికి పాల్పడుతున్న సదరు కీలక అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే సస్పెండ్ చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్పలతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు గోపాల్‌రెడ్డి, లాలయ్య, శానప్ప, మహిపాల్ రెడ్డి, చంద్రయ్య, సత్తయ్య తదితరులు డిమాండ్ చేశారు.

ఈ అధికారిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని, లేదంటే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

# ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేసింది

### ఏ ఎమ్మెల్యే గోడ దూకిన నెగ్గేది బిఆర్ఎస్సే

### ఎస్ఐఆర్ పట్ల పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలి

### శంషాబాద్ సమావేశంలో మాజీ మంత్రి కెటిఆర్





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కెటిఆర్

**శంషాబాద్, జూన్21, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులోకి వచ్చాక పేదల బతుకులు అధ్వానంగా మారయని విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిని మోసం చేసిందని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పోవాలి ...బిఆర్ఎస్ రావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు. శంషాబాద్ మండలంలోని జెడి ఫంక్షన్ హాల్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా మాజీ మంత్రి కెటిఆర్ హాజరై మాట్లాడారు...బిఆర్ఎస్ నాయకులు గట్టిగా ఉన్నతకాలం ఏ ఎమ్మెల్యే పార్టీ నుండి వెళ్లిపోయిన ఎంత పెద్ద నాయకులు గోడలు దూకిన రాజేంద్రనగర్‌లో మళ్లి ఎగిరేది బిఆర్ఎస్ జెండానేనని అన్నారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీ ఇచ్చి అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని కానీ అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయలేక ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే పెగులు తీసి మోడల వేసుకుంటాం ,గుడ్లు పికి గోల్లిలు అడుతా అటు ఒక సిఎం సోయి తప్పి మాట్లాడు తున్నాడని అన్నారు.

మరోపక్క ఉన్న హైదరాబాద్ సిటిని బాగా చేయకుండా ఫీచర్ సిటి అంటు తిరుగుతూ అడ్డగోలుగా భూములను పంచుకుం టున్నారన్నారు. అదేవిధంగా మూసి పేరుతో పేదల ఇళ్లు కూల్చి రోడ్డుపాలు చేస్తున్నారని గాంధీ పేరుతో రేవంత్ రెడ్డి చేస్తున్న విధ్వంసాన్ని చూస్తే మహాత్మాగాంధీ ఆత్మ కూడా ఘోషిస్తుందని అన్నారు. హైడ్రా పేరుతో పెదల ఇళ్లు కూలుస్తూ పెద్దలను వదలిపెడు తున్నారని మూటలు కట్టడం ఢిల్లికి పంపడం తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏం లేదని తీవ్ర విమర్శలు చేశారు.

**అసలైన ఓటర్లకు అన్యాయం జరగద్దు**

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్ఐఆర్ పట్ల బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ప్రతి బిఎల్ఓలు అసలైన ఓటరుకు న్యాయం జరిగేలా చూడాలని ఎమైన అభ్యతరం ఉంటే వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పార్టీ అప్పగించిన బిఎల్ఓలు వారి బూత్‌లో దొంగ ఓట్లకు అస్కరం లేకుండా చూడాలని ప్రతి ఓటు క్షణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, సురభివాణి దేవి, స్వామి గౌడ్ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కారిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 25న బాలాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ట

**సరూర్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** బాలాపూర్ గ్రామంలో ఈ నెల 25వ తేదీ నుండి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జరిగే బొడ్రాయి పునః ప్రతిష్టా పనోత్సవాలకు హాజరుకావాలని ఉత్సవ కమిటీకి చెందిన పలువురు ముఖ్య నేతలు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి బొడ్రాయి పండుగ ఆహ్వాన పత్రికను అందజేసారు.
రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీమా ఏజెంట్ల హక్కుల పరిరక్షణకు చట్టం అవసరం

**చిక్కడపల్లి, జూన్ 21 ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా ఉన్న జీవిత బీమా ఏజెంట్ల హక్కులు, సంక్షేమాన్ని పరిరక్షించేందుకు ఒక సమగ్ర చట్టం అవ సరమని, ఇందుకు తగిన చట్ట సవరణల కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్, మాజీ సిఎల్ఐఎ చైర్మన్, అడ్వైజరీ కమిటీ సహచైర్మన్ కౌటికె విఠల్ అన్నారు. ఏజెంట్లకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య జాతీయ సర్వసభ్య సమావేశాలు ముగిసిన సందర్భంగా నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షులు సతీందర్ సింగ్ కాలా, సెక్రటరీ జనరల్ ఎస్.బి. శ్రీనివాసచారి, ఉపాధ్యక్షులుగా సింగారపు శ్రీనివాస్ తదితరులను సత్కరించారు.